అధ్వానంగా మ్యాన్‌హోల్స్

- వర్షం పడితే చెరువులా మారిపోతున్న చంద్రంపాలెం హైస్కూల్ మైదానం
- సమీక్షలకే పరిమితం అవుతున్న అధికారులు



చంద్రంపాలెం హైస్కూల్లో రక్షణ లేని మ్యాన్ హోల్



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపిస్తున్న పాఠశాల మైదానం

మధురవాడ : రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం హైస్కూల్ చిన్నపాటి లోపాలతో తన ప్రత్యేకతను కోల్పోతోంది. సుమారు 5 ఎకరాల్లో జాతీయ రహదారిని ఆనుకుని సువిశాల ప్రాంగణంలో వెలుగొందుతున్న ఈ పాఠశాల మైదానం చిన్న పాటి వర్షం కురిసినా చెరువులా మారిపోతోంది. ఒక్క రోజు వర్షం కురిస్తే సుమారు 10 రోజుల పాటు విద్యార్థులు మైదానంలో ప్రార్థనలు, ఆటలు, ఎన్‌సీసీ క్యాడెట్లు డ్రిల్లు వంటివి చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. సరికదా పాఠశాలలోకి రాకపోకలు కూడా సాగించలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. దశాబ్దాలుగా ఇబ్బంది ఈ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలో తాత్కాలికంగా సుమారు రు. 5 లక్షలు వెచ్చించి నీరు నిల్వ ఉండిపోయే చోట మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. కాని నిర్వహణ సక్రమంగా లేక ×ఎక్కడ వేసిన గొంగళి అక్కడే× అన్నట్లు సమస్య ఉండిపోయింది.

నిర్వహణ అధ్వానం..

మైదానంలో ఐదారు చోట్ల మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసి పైపులైన్లు వేశారు. కాని సక్రమంగా పూడిక తీయడం, నీరు చేరే మార్గాలు గుర్తించి సరి చేయటం వంటి నిర్వహణ పనులు చేయకపోవడంతో ఎన్ని లక్షలు ఖర్చు చేసినా బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలిందని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

సమీక్షలకే పరిమితం..

ఈ పాఠశాలకు తరచూ ఆర్‌జేడీ, డీఈవో వంటి ఉన్నతాధికారులు వచ్చి పరిశీలనలు, సమీక్షలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం వీరైనా పూర్తి స్థాయిలో దృష్టి సారించి మ్యాన్ హోల్స్ నిర్వహణకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తత అవసరం



విపత్తుల సమయాల్లో తీసుకోవలసిన చర్యల గురించి వివరిస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: విపత్తుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఎన్‌డీఆర్‌ఎఫ్ టెన్త్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ గాదె ఈశ్వరరావు సూచించారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ టెన్త్ బెటాలియన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులు సంభవించేటప్పుడు నష్టాలను తగ్గించుకునే చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాల బారిన పడేవారిని రక్షించి ప్రాథమిక చికిత్స చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ధైర్యంగా ముందుకు వచ్చి సహాయక చర్యలు చేపట్టాలని, దీని వల్ల చాలా వరకు ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించవచ్చన్నారు. అనంతరం సహాయక చర్యలు, తీసుకోవాల్సిన మెళకువలను ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ఎస్.శ్రీను, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ



పూజలకు హాజరైన భక్తులు

మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో ఆషాడ మాసం శుక్ల పక్షం షష్ఠిని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. మూల విరాట్‌కి పంచామృత, సుగంధ, ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్పార్చనలు అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా హాజరై కుంకుమ పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. చంద్రంపాలేనికి చెందిన పిళ్లా సూరిపాత్రుడు, గీత భాను, సాయిప్రియ వాస్తవ్యులు అప్పలనాయుడు, సూర్యకుమారి దంపతుల సహకారంతో పులిహోర, ఇతర ప్రసాదాలు అమ్మకి నివేదించి భక్తులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పీవీజీ అప్పారావు, పిళ్లా శ్రీనివాసరావు, పిళ్లా వెంకటరమణ, కేశనకుర్తి అప్పారావు, పిళ్లా రాజు, పిళ్లా మోహనకృష్ణ, పిళ్లా రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి, స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నరసింహావతారంలో జగన్నాథుడు



నరసింహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

భీమునిపట్నం: భీమిలిలో జరుగుతున్న జగన్నాథస్వామి కల్యాణ రథోత్సవ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆర్.కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అవతారం గొప్పదనం గురించి భక్తులకు వివరించారు.

ట్రిపుల్ ఐటీలో సత్తా చాటిన విద్యార్థులు

తగరపువలస : గురువారం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ సీట్లలో భీమిలి మండలం అమనాం, లక్ష్మీపురం జెడ్పీ హైస్కూళ్లకు చెందిన నలుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు లభించాయి. అమనాంకు చెందిన వేముల జ్ఞానలక్ష్మి, కొయ్య జాహ్నవికి సీట్లు వచ్చినట్టు ప్రధానోపాధ్యాయురాలు ఏఆర్ విజయకుమారి తెలిపారు. వీరికి ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో వరుసగా 569, 568 మార్కులు లభించాయి. అలాగే లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మద్దిల రాహుల్, మొకర దివాకర్ ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. వీరికి పదవ తరగతి పరీక్షల్లో వరుసగా 584, 580 మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను ఉపాధ్యాయులు, పంచాయతీ పెద్దలు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఇందు..



ఇందు


పద్మనాభం : మండలంలోని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024లో పదో తరగతి చదివిన మరగడ ఇందు ట్రిపుల్ ఐటీకీ ఎంపికైంది. పదో తరగతిలో 569 మార్కులు సాధించిన ఇందు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఇందు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

నేడు శ్రీతిరుమల బాలాజీ దివ్య క్షేత్రానికి వెంకయ్యనాయుడు

అక్కిరెడ్డిపాలెం: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రానికి శనివారం ఉదయం 6 గంటలకు విచ్చేయనున్నట్లు దివ్యక్షేత్రం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని దివ్యక్షేత్రం ప్రతినిధులు తెలిపారు. వెంకయ్యనాయుడుకు ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు.

అసంపూర్తి వెలుగులతో ఇక్కట్లు

- బోరవానిపాలెం వద్ద వెలగని రింగ్ లైట్



బోరవానిపాలెం జంక్షన్ వద్ద నామమాత్రంగా వెలుగుతున్న రింగ్ లైట్

మధురవాడ : వీధి లైట్ల నిర్వహణలో జీవీఎంసీ అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మారుమూల, శివారు ప్రాంతాల్లోనే కాదు హైవేని ఆనుకుని ఉన్న ప్రాంతాలు, జంక్షన్‌లలో కూడా లైటింగ్ సక్రమంగా వెలగడం లేదు. దీనికి జీవీఎంసీ 6వ వార్డు బోరవానిపాలెం జంక్షన్‌లో రింగ్ లైట్ ఒక ఉదాహరణ. ఇక్కడ హైవే నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డులో ఉన్న రింగ్ లైట్ గత కొంత కాలంగా అసంపూర్తిగానే వెలుగుతోంది. దీంతో ప్రధాన జంక్షన్‌లో కూడా వెలిగీ వెలగని లైట్ వల్ల వచ్చిన అసంపూర్తి వెలుతురుతో స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందంటున్నారు స్థానికులు. కనీసం ఉన్నత స్థాయి అధికారులు అయినా తక్షణమే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

చంద్రంపాలెం హైస్కూల్లో 15న స్క్రాప్ వేలం

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విరిగిపోయిన బెంచీలు, కుర్చీలు, తదితర స్క్రాప్‌ను ఈ నెల 15న వేలం వేయనున్నట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు తెలిపారు. పాఠశాల ఆవరణలో ఉదయం 9.30 గంటకు వేలం వేస్తామని, ఆసక్తి కలిగిన కొనుగోలుదారులు పాడుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

దంచి కొట్టిన వర్షం



ఆదర్శనగర్‌లో జలమయమైన రహదారి

- ఉపశమనం పొందిన ప్రజలు
- సాగుకు మేలంటూ అన్నదాతల ఆనందం



తగరపువలసలో కురుస్తున్న వర్షం

తగరపువలస: భీమిలి పరిసరాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రెండు సార్లు వర్షం దంచి కొట్టింది. వర్షానికి తోడు ఉరుములు, మెరుపులు, గాలులు తోడవటంతో రెండు గంటల పాటు జనం ఇళ్లకే పరిమితం అయ్యారు. పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు వర్షం నీటితో నిండిపోయాయి. గంటల కొద్దీ రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. డ్రైనేజీల నుంచి చెత్త రోడ్లపైకి చేరింది. శ్రీనగర్, ఆదర్శనగర్, సంతపేట, చిల్లపేట, సంగివలసలో పలు ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ నీరు నిలిచిపోయింది. విద్యా సంస్థలు విడిచిపెట్టే సమయం కావడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లడానికి అంతరాయం కలిగింది. జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస, సబ్బివానిపేట సర్వీస్ రోడ్లపై రెండు అడుగుల మేర వర్షంనీరు నిలిచిపోయింది. ఇటీవల ఎండల ధాటికి ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనం వర్షానికి ఉపశమనం పొందారు. నారుమడులు, కూరగాయలు, ఆకుకూరలు, నువ్వు పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాగితం సంచుల వినియోగమే శ్రేయస్కరం



తయారు చేసిన కాగితం సంచులను ప్రదర్శిస్తున్న డైట్ సిబ్బంది

భీమునిపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కాగితం సంచులనే వినియోగించాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. శుక్రవారం ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు కాగితాల సంచులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తుండడం వల్ల ఎన్నో అనర్థాలకు దారి తీస్తున్నాయన్నారు. దీన్ని అడ్డుకోవలసిన బాధ్యత, అవసరం అందరిపైనా ఉందన్నారు.

నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పద్మనాభం: రైతులు నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం సూచించారు. కిలో వరి విత్తనాలకు మూడు గ్రాముల కార్బండిజం లేదా సూడోమోనాస్‌తో శుద్ధి చేయాలన్నారు. వారం రోజుల పాటు నీరు పెడుతూ తీస్తూ ఉండాలని చెప్పారు. నారుమడిలో కలుపు వచ్చే అవకాశం ఉంటే బూటో క్లోర్ కలుపు మందును ఐదు మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నారుమడిలో రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, రెండు కిలోల పొటాష్ చల్లాలని తెలిపారు. వారం రోజుల తరవాత ఆకుమడి ఎర్రగా కన్పిస్తే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 25 రోజుల నారును ఉపయోగిస్తే పిలకలు ఎక్కువగా వస్తాయని తెలిపారు. వారం రోజుల్లో నారు తీస్తామనగా ఐదు సెంట్ల మడిలో 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ వాసన రాని 3 జీ గుళికలు వేయాలని చెప్పారు. దీని వల్ల నాట్లు వేసిన 30 రోజుల వరకు ఎటువంటి చీడ పురుగులు ఆశించవన్నారు.

అతిసార వ్యాధిపై ఇంటింటా అవగాహన

తగరపువలస : ఈ సీజన్‌లో తలెత్తే అతిసార తదితర వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఇంటింటా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఏపీడీవో సంతోష్ ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని సూచించారు. వాటర్ ట్యాంకులు ఎల్లప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఎవరికైనా అనారోగ్యం అనిపిస్తే దగ్గరలో ఉన్న ఏఎన్‌ఎంకు సమాచారం అందించి చికిత్స పొందాలన్నారు.

ఏపీలో రోబోటిక్స్ పరిశోధన కేంద్రం



మాట్లాడుతున్న ఐరా చైర్మన్ కిషన్

కొమ్మాది: రోబోటిక్స్‌లో పరిశోధనలు, యువతలో నైపుణ్యాలను పెంచడానికి రాష్ట్రంలో రోబోటిక్స్ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని ఆల్ ఇండియా రోబోటిక్స్ అసోసియేషన్ (ఐరా) చైర్మన్ కిషన్ తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రోబోటిక్ రంగం–భవిష్యత్తు అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో రోబోటిక్స్ విజ్ఞానాన్ని, నైపుణ్యం గల మానవ వనరులను పెంచడానికి ఐరా కృషి చేస్తుందన్నారు. ప్రత్యేకంగా రోబోటిక్స్ విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

కొమ్మాది: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ అన్నారు. శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ లా నిర్వహించిన రహదారి భద్రత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యజమాని తన వాహనాన్ని వేరొకరు వాడటానికి ఇచ్చిన సందర్భంలో ప్రమాదం జరిగితే యజమాని కూడా బాధ్యుడు అవుతాడని తెలిపారు. హెల్మెట్ ధరించడం బరువుగా భావించకుండా, బాధ్యతగా భావించాలని సూచించారు.

యూనిఫారాల అందజేత



యూనిఫారాల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లలో భాగంగా యూనిఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు బాధ్యత తీసుకుని తమ పిల్లల్ని ఇంటి వద్ద చదివించడం, రాయించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ర్యాలీలో పాల్గొన్న శ్రామిక్ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్) పిలుపు మేరకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్‌ఎం కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు హాజరై.. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కో–ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా నాయకత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పట్నాయక్ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. పోరాటాల ఫలితంగా పాత పెన్షన్ విధానాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐఆర్‌ఎఫ్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకుంటే 1972లో చేసిన విధంగా సమ్మె చేసేందుకు సిద్ధమన్నారు. ర్యాలీ అనంతరం ప్రధాని మోదీకి రాసిన వినతిపత్రాన్ని వాల్తేర్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు అందజేసి.. ప్రధానికి పంపాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు పి.వి.జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు గండ్రేడి నూకరాజు (ఫైల్)

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీ కొనడంతో డ్రైవర్ గండ్రేడి నూరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాపట్నం జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గండ్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో.. ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు బయలుదేరింది.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు.

వివాహిత అదృశ్యం



భవానీ (ఫైల్)

అల్లిపురం: తన భార్య కనిపించడం లేదని అల్లిపురం, గాంధీ బొమ్మ జంక్షన్‌కు చెందిన ఎస్.సురేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. గత ఏడాది డిసెంబర్ 24న సురేష్ పనికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకోగా అతని భార్య ఎస్.భవానీ కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంది. అప్పటి నుంచి నగరం, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 92941 06386, 9440 904716కు తెలియజేయాలని సీఐ కోరారు.